## క్లుప్తంగా

### రోడ్డుకు మరమ్మతులు



పనులు చేస్తున్న దృశ్యం

**సి.బెళగల్:** మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామానికి వెళ్లే దారి పూర్తిగా అధ్వానంగా ఉండటంతో సర్పంచ్ రోజ సొంత నిధులతో మరమతులు చేయించారు. 15 రోజుల క్రితం ఆటో డ్రైవర్లు రోడ్డుపై నల్ల మట్టిని వేయడంతో వర్షం కారణంగా బురదమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బంగా మారింది. దీంతో సర్పంచ్ శుక్రవారం కంకర చిప్సను వేయించి, దానిపై మట్టితో చదును చేయించారు. పనులను వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మహానంది పర్యవేక్షించారు.

### సద్వినియోగం చేసుకోండి

**గడివేముల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జబీనా సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయం ఆవరణంలో గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో మంచానికే పరిమితమైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### గొర్రెల పెంపకందారులకు శిక్షణ



మాట్లాడుతున్న ఏడీఏ కమలాకర్

**పాణ్యం:** స్థానిక పాదుపు కార్యాలయంలో శుక్రవారం గొర్రెల పెంపకందారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాణ్యం పశుసంవర్ధక శాఖ ఏడీఏ కమలాకర్, ప్యాపిలి ఎస్‌సీ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, రామసుబ్బారెడ్డి హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ ఉసేన్‌బీ మాట్లాడుతూ.. గొర్రెల పెంపకందారులు పశు వైద్యాధికారుల సూచనలు పాటించాలన్నారు. సకాలంలో టీకాలు వేయించి, గాలికుంటు వ్యాధులను నివారించాలన్నారు. ఏడీఏ కమలాకర్ మాట్లాడుతూ.. జీవాల పెపకంలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో జీవాలకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జీవాల పోషణ, నష్టల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అలాగే ఈ నెల 27న యాగంటి పల్లె కేవీకేలో గొర్రెల పెపకందారులకు సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. పశువైద్యులు ప్రశాంతి, శ్రీనివాసులు. జానకి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటి సర్వేకు సామగ్రి పంపిణీ



బీఎల్‌ఓలకు మెటీరియల్ అందిస్తున్న ఎన్నికల డీటీ ప్రవీణ్

**గూడూరు:** ఓటరు జాబితా సంక్షిప్త సవరణ-2024 కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఎన్నికల డీటీ ప్రవీణ్ కుమార్ మెటీరియల్ పంపిణీ చేశారు. నేటి నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితా సవరణ చేపడుతారని ఆయన పేర్కొన్నారు. మృతి చెందిన ఓటర్లు, డబల్ ఎంట్రీలు గుర్తించి తొలగిస్తామన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయసు నిండే వారిని ఓటరు జాబితాలో నమోదు చేస్తారని తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### నేడు రైతుబజార్లలో సబ్సిడీపై టమాట పంపిణీ

**కర్నూలు(అగ్రికల్చర్):** నగరంలోని మూడు రైతుబ జార్లలో శనివారం సబ్సిడీపై టమాట పంపిణీ చేయనున్నారు. మదనపల్లిలో శుక్రవారం మార్కెటింగ్ శాఖ అధికారులు ఆరు టన్నుల టమాట కొనుగోలు చేశారు. వినియోగదారులకు ప్రభుత్వం వాటిని కిలో రూ.50 ప్రకారం పంపిణీ చేస్తుందని జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయసంచాలకులు నారాయణ మూర్తి తెలిపారు. సీ.క్యాంపు, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా పంపిణీ చేస్తామని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టమాట పంపిణీ పారదర్శకంగా నిర్వహించేందుకు మూడు రైతుబజార్లకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. ఆధార్ లేదా రైస్‌కార్డుపై ఒక్కొక్కరికి కిలో ప్రకారం పంపిణీ చేస్తామని తెలిపారు.

# జగనన్నకు రుణపడి ఉంటాం

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన చేనేతలు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

**కోడుమూరు రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం రూ.24 వేలు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం కోడుమూరులో చేనేత కార్మికులు ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి సంబరాలు చేసుకున్నారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు సిబి.మణి మాట్లాడుతూ చేనేత కార్మికుల కష్టాలను తెలుసుకుని వారి ఆర్థిక ఇబ్బందులను తొలగించేందుకు ఏటా వైఎస్సార్ నేతన్న నేస్తం కింద అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి రూ.24 వేలు మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. నేతన్న నేస్తం కింద జిల్లాలోని 3,461 మంది చేనేత కార్మికులకు రూ.8.30 కోట్లను మంజూరు చేసి, చేనేతల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సోమశంకర్ యాదవ్, దానకర్ణ, వెంకటేశ్వర్లు, గోపాల్, ధర్మరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### కష్టాలు తెలిసిన నేత



గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా మా గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన హామీకి కట్టుబడి ఏటా వైఎస్సార్ నేతన్న నేస్తం కింద మా ఖాతాల్లో రూ.24 వేల చొప్పున నగదు జమ చేస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది. మా కష్టాలను తెలుసుకుని జగనన్న చేస్తున్న మేలును ఎన్నటికీ మరువలేము. చేనేతలంతా జగనన్నకు రుణపడి ఉంటారు. – పుండరీకా, చేనేత కార్మికుడు, కోడుమూరు

### రుణం తీర్చుకోలేనిది



చేనేత రంగాన్నే నమ్ముకుని ఏళ్లతరబడి చీరలను నేస్తూ జీవిస్తున్న మా లాంటి కార్మికుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి యేడాది వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద రూ.24వేలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో ఏ ప్రభుత్వం కూడా మమ్మల్ని పట్టించుకోలేదు. జగనన్న చేస్తున్న ఆర్థిక సాయం మమ్మల్ని ఎంతగానో ఆదుకుంటోంది. – గణేష్, చేనేత కార్మికుడు, కోడుమూరు

# అర్హులందరికీ మంచి జరగాలన్నదే ధ్యేయం



గొల్లలదొడ్డిలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

**సి.బెళగల్:** అర్హులందరికీ మంచి జరగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం కంబదహాల్, గొల్లలదొడ్డి గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష సదస్సుల్లో ఎమ్మెల్యే పాల్గొని పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన తెచ్చారన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో పరిష్కారం కాని సమస్యలేమైనా ఉంటే జగనన్న సురక్ష సదస్సుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. గత ప్రభుత్వంలో ఏ చిన్న సర్టిఫికెట్ అవసరమైనా రోజుల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఖర్చు లేకుండా, మండల కార్యాలయానికి వెళ్లకుండా ఇంటి వద్దకే వచ్చి సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాల్సి ఉందని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, గొల్లలదొడ్డి సర్పంచ్ రామలింగమ్మ, సి.బెళగల్ ఎంపీటీసీ సభ్యుడు వీరన్న, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు మహానంది, రంగారెడ్డి, రాముడు, సూర్యచంద్ర, రాజు, లోకేష్, రఘురెడ్డి ఉన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



వాహనమిత్ర దరఖాస్తుదారుడి వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

**కోడుమూరు రూరల్:** వాహన మిత్ర, కాపు నేస్తం పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సొంత ఆటో కలిగివుండడంతో పాటు డ్రైవింగ్ లైసెన్, ఆర్‌సీ, కుల, ఆదాయ, ఆధార్, రైస్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జత చేసి ఈనెల 25వ తేదీలోగా సచివాలయంలో అందజేయాలన్నారు. అలాగే కాపు నేస్తంకు దరఖాస్తు చేసుకునేవారు బలిజ, తెలగ, ఒంటరి, కాపు కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళలు అర్హులని, వారు కుల, ఆదాయ సర్టిఫికెట్లతో పాటు ఆధార్ హిస్టరీ, రైస్‌కార్డు, బ్యాంకు పుస్తకం జిరాక్స్ కాపీలతో ఈనెల 22వతేదీలోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



స్టాంటన్‌పురంలో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

**కర్నూలు (న్యూటౌన్):** దేశంలోనే ఎక్కడా లేవన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కోరారు. శుక్రవారం 38వ వార్డు స్టాంటన్‌పురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కాలనీలో మురుగునీటి కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా వెంటనే పరిష్కరించాలని నగర పాలక సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించి, సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని కోరారు. కార్పొరేటర్లు గిప్సన్, సాంబ, నగర పాలక, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### 'ప్యాకేజీ స్టార్.. తప్పుడు వ్యాఖ్యలు మానుకో'

**కర్నూలు (న్యూటౌన్):** ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ సాంబ, నాయకులు మహబూబ్‌బాషా, హరినాథ్‌రెడ్డి, శేషిరెడ్డి, రామ్‌నాథ్‌రెడ్డి, గోపాల్, భాస్కర్, సంపత్‌కుమార్, ప్రసాద్, చిన్న లక్ష్మన్న, మోహన్‌బాబు, తులసిరెడ్డి, దస్తగిరి, సుంకన్న, వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న సురక్ష ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 6.80 లక్షల ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత నాలుగేళ్లగా దేశమంతా వలంటీర్ల సేవలను మెచ్చుకుంటే.. ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ హీనంగా మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ల ద్వారా సేవలు పొందిన కుటుంబాలను అడిగితే ఆ వ్యవస్థ గొప్పతనం తెలుస్తుందన్నారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని అవహేళనగా మాట్లాడారని గుర్తు చేశారు.

### ఏళ్ల నాటి సమస్య పరిష్కారం

**పాణ్యం:** మండల పరిధిలోని నెరవాడ గ్రామం ముందు ఉన్న రైల్వే బ్రిడ్జికి అండర్ డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం పనులను పరిశీలించిన సర్పంచ్ లింగాల శారదమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో రైల్వే బ్రిడ్జి కింద సరైన కాల్వలు లేకపోవడంతో 3–4 అడుగుల మేర వర్షపు నీరు, డ్రైనేజీ నీటితో కలిసి ప్రవహించడంతో రోజూ ప్రమాదాలు జరిగేవన్నారు. ఇటీవల రైల్వే శాఖ అధికారులు డబుల్ లైన్ పనులు ప్రారంభించగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌తో సికింద్రాబాద్‌లో సమావేశమై సమస్యను వివరించారు. దీంతో బ్రిడ్జి కింద అండర్ డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటుకు జీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే కృషి ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### నేడు ఓర్వకల్లులో 'జగనన్న సురక్ష'

**ఓర్వకల్లు:** మండలంలోని ఓర్వకల్లు, లొద్దిపల్లె గ్రామాలలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఓ ప్రకటలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లొద్దిపల్లెలో, సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటలకు ఓర్వకల్లులో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఓర్వకల్లులో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు.

### నేడు ఉలిందకొండలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

**కల్లూరు:** మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు. మండల స్థాయి అధికారులు నివేదికలతో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

### జయప్రదం చేయండి

**కల్లూరు:** ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఆదోని నుంచి కర్నూలు వరకు నిర్వహించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపాడు గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి మధు అధ్యక్షతన జీపు జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి గ్రామమైన పెద్దపాడులో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణ, రామాంజనేయులు, గోపి, మద్దిలేటి, శేఖర్, లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

### కేసీకి నీటి విడుదల

**గూడూరు:** సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు శుక్రవారం తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, డ్యాంలో ప్రస్తుతం 0.845 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

### వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

**గూడూరు:** సమస్యల సాధన కోసం వీఆర్‌ఏలు రిలే దీక్షలు చేపట్టారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం పిలుపు మేరకు ఈ ఆందోళన నిర్వహించినట్లు వీఆర్‌ఏలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల మండల సంఘం అధ్యక్షుడు శివయ్య మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఏ రికవరీని నిలిపివేసి, డీఏతో కూడిన వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆగస్టు 25న ఛలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



సి.బెళగల్‌లో సమావేశమైన సర్పంచ్‌లు

**సి.బెళగల్:** మండలంలో గ్రామ సర్పంచ్‌ల సంఘంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు, బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల సర్పంచ్‌లు దస్తగిరి, ఇమ్మానియేల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సి.బెళగల్‌లో సమావేశమై తమ సమస్యలు, అవసరాలపై చర్చించారు. అనంతరం సంఘంగా ఏర్పాటయ్యేందుకు తీర్మానించుకున్నారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా కొత్తకోట గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షురాలిగా గుండ్రేవుల సర్పంచ్ మాధవి, కార్యదర్శిగా సి.బెళగల్ సర్పంచ్ పాండు రంగన్న, ట్రెజరర్‌గా సంగాల సర్పంచ్ హనుమంతుతో పాటు మరో 14 గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లను సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. సర్పంచ్‌ల సంఘం కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

## మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



గూడూరులో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**గూడూరు:** మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జీ.మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో కార్మికులు తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులను ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చడాన్ని తప్పుపట్టారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌లకు కార్మికులు అందించారు. కార్మికులు శాంతన్న, మనోహరమ్మ, లక్ష్మిదేవి, అచ్చమ్మ, దానమన్న, తదితరులు పాల్గొన్నారు.

### చిన్న సినిమాలను ఆదరించాలి

**ఎమ్మిగనూరుటౌన్:** సందేశాత్మకంగా నిర్మించే చిన్న సినిమాలను ప్రేక్షలు ఆదరించాలనే అప్పుడే సినీరంగంలో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు పేర్కొన్నారు. ఎమ్మిగనూరుకు చెందిన వినోద్‌రెడ్డి, చాందినీ హీరో హీరోయిన్లుగాను స్థానికులైన డైరెక్టర్ వసంత్‌కుమార్, నిర్మాతలు ఉమాదేవి, అగ్రహారం నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన ఇన్‌ఫార్మర్ చిత్రం పోస్టర్‌తో పాటు ట్రైలర్‌ను శుక్రవారం ప్రముఖ సినీ నిర్మాతలు రూపా జగదీష్, సంజీవరెడ్డి, సినీ తారాగణంతో కలిసి చైర్మన్ ఆవిష్కరించారు. ప్రేమతో పాటు క్రైం తదితర అంశాలతో సందేశాత్మకంగా నిర్మించిన ఈ సినిమాను ఆదివారం విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారుడికి కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ సోమేశ్వరమ్మ

**కర్నూలు (న్యూటౌన్):** అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు మండలం గార్గేయపురం గ్రామ సచివాలయం-1, 2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ హాజరై.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులందరికీ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇంకా ఎవరైనా పథకాలు అందక మిగిలిపోయి ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మేలు చేకూరుస్తామని స్పష్టం చేశారు. సురక్ష కార్యక్రమంలో 751 కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తూ, సంక్షేమ పథకాలతో అందరి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీపీ, సర్పంచ్, మాజీ సర్పంచ్, మాజీ మండల ఉపాధ్యక్షులు, సచివాలయ కన్వీనర్‌లను గ్రామ సచివాలయ సిబ్బంది శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. గార్గేయపురం సర్పంచ్ సోమేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ ఏసేపు, నాయకులు వాసు, సురేష్, శేఖర్, సునీల్, కర్నూలు ఎంపీడీఓ ఆజాంఖాన్, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, పీఎస్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### సులభంగా ధ్రువీకరణ పత్రాలు

**కల్లూరు:** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం తీసుకువచ్చారని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 74వ వార్డు సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణం వేగవంతం చేయండి



ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన కర్నూలు, బెళగల్, గూడూరు జెడ్పీటీసీలు

**కర్నూలు (న్యూటౌన్):** కర్నూలు వయా ఉల్చాల, రేమట నుంచి కొత్తకోట, కర్నూలు మండలం రేమట, పూడూరు గ్రామాలకు రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కర్నూలు, సి.బెళగల్, గూడూరు జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మౌలాలి కోరారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సహకారంతో వారు శుక్రవారం విజయవాడలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సజ్జల రామకృష్ణారెడ్డి వెంటనే స్పందించి ఆర్‌అండ్‌బీ స్టేట్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి త్వరితిన రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేయకపోతే టెండర్‌ను రద్దు చేయాలని ఆదేశించారు.

## అందరికీ ఓటు హక్కు



గడివేములలో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

**గడివేముల:** మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్తగా ఓటు హక్కు నమోదు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం గడివేములలో జరుగుతున్న ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆయా గ్రామాలలో ప్రతి ఇంటికీ బీఎల్‌ఓలు వెళ్లి ఆ ఇంట్లోని ఓటర్ల వివరాలను జాబితాలో సరిచూస్తారని తెలిపారు. డబుల్ ఎంట్రాలు, చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు వచ్చే నెల 21వ తేదీ వరకు సమయం ఉందన్నారు. ఓటరు సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి తారకేశ్వరి, మహిళా పోలీస్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణదారులు నిబంధనలు పాటించాలి



సి.బెళగల్‌లో విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

**సి.బెళగల్:** విత్తన దుకాణదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు అమ్మకాలు జరపాలని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ఏడీఏ వేదమణి అన్నారు. శుక్రవారం ఆమె డీఆర్‌సీ ఏఓ హేమలత, మండల ఏఓ మల్లేష్‌కుమార్‌తో కలిసి సి.బెళగల్‌లోని విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. బిస్మిల్లా ట్రేడర్స్, విశ్వజిత్ ట్రేడర్స్, ఓం శ్రీ నాగసాయి విత్తన దుకాణాలలో నిల్వల రికార్డులు, బిల్లులు, అమ్మకాల రిజిష్టర్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నిషేధిత విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, దుకాణంలో ధరలు, నిల్వల బోర్డులను ప్రదర్శించాలని, రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. నకిలీ, గడువు ముగిసిన విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో సరైన రికార్డులు లేని కారణంగా బిస్మిల్లా ట్రేడర్స్‌లో రూ.6,900, విశ్వజిత్ ట్రేడర్స్‌లో రూ.1,60,173, ఓం శ్రీ నాగసాయి దుకాణంలో రూ.2,46,173 విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. వీరి వెంట ఎంపీఈఓలు, వీపీఏఎస్‌లు ఉన్నారు.

## సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో సీపీఆర్ గురించి వివరిస్తున్న డాక్టర్ విజయానందబాబు

**కర్నూలు(హాస్పిటల్):** ఆపదలో ప్రాణాలు నిలిపే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు చెప్పారు. చిన్నపిల్లల విభాగం, ఐఏపీ ఆధ్వర్యంలో శుక్రవారం నేషనల్ సీపీఆర్ డే సందర్భంగా స్థానిక గుత్తిరోడ్డులోని మాంటి ఇంటర్నేషనల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ కోవిడ్ అనంతరం ఇటీవల గుండెపోటు మరణాలు పెరిగాయని, అకస్మాత్తుగా చాలా మంది గుండెపోటుతో కుప్పకూలుతున్న సంఘటనలు చూస్తున్నామని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మరణాలు తగ్గించేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐఏపీ కార్యదర్శి డాక్టర్ వీరరత్నాకర్‌రెడ్డి, చిన్నపిల్లల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కృష్ణ, ప్రకాష్ ఆనంద్, నియోనెటాలజిస్టు డాక్టర్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.